సాక్షి
విజయనగరం
శుక్రవారం । 2 । జూన్ । 2023



రైతులకు యంత్ర సాయం

ప్రభుత్వం సాగును సులభతరం చేస్తోంది. రైతన్నలకు రాయితీపై యంత్రాలను అందజేస్తోంది.

- 8లో



పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు.

- 8లో



గడపగడపకు ద్విశత దినోత్సవం

ఎస్.కోట నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజులుగా నిర్విఘ్నంగా సాగుతోంది.

- 8లో

న్యూస్‌రీల్

కల్యాణం.. కమనీయం



సంతాన వేణుగోపాల స్వామి కల్యాణాన్ని జరుపుతున్న వేదపండితులు

లక్కవరపుకోట: మండలంలోని కళ్లెంపూడి గ్రామంలో రుక్మిణీ సత్యభామా సమేత సంతాన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త ఏడువాక శ్రీను ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపించారు. స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేముళ్లు, బి.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏలో 28 మందికి స్థానచలనం

విజయనగరం అర్బన్: ప్రభుత్వం ప్రకటించిన బదిలీ ప్రక్రియలో భాగంగా డీఆర్‌డీఏ పరిధిలోని వివిధ కేటగిరీల్లో 28 మంది ఉద్యోగులకు స్థానచలనం జరిగింది. బదిలీ అయిన వారిలో డీపీఎంలు ఇద్దరు, ఏపీఎంలు ఏడుగురు, హెచ్‌ఆర్ సీసీలు ఏడుగురు, ఎంఎస్ సీసీలు 8మంది, ఏఏలు ఒక్కరు, ఓఏలు ముగ్గురు ఉన్నారు. వీరిలో జిల్లా స్థాయిలో 9 మందికి, అంతర్ జిల్లాల పరిధిలో 119 మంది ఉన్నారు. జిల్లా నుంచి బయట జిల్లాకు వెళ్లిన వారు 8 మంది, ఇతర జిల్లా నుంచి వచ్చిన వారు 11 మంది ఉన్నట్టు డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ



జేడీ విశ్వేశ్వరరావు

విజయనగరం ఫోర్ట్: పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ ఎ.విశ్వేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. వైఎస్సార్ పశుసంచార వైద్య శాలలు ద్వారా పాడి పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

బాలికల కబడ్డీ జట్టు కోచ్, మేనేజర్ల నియామకం



విజయలక్ష్మి

విజయనగరం: ఢిల్లీలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు 66వ అండర్–19 జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నవి. ఇందులో పాల్గొనే ఆంధ్ర ప్రదేశ్ బాలికల జట్టుకు కోచ్‌గా గరివిడి మండలం కోనూరు జిల్లా పరిషత్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు, జాతీయ స్థాయి క్రీడాకారిణి ఎస్.విజయలక్ష్మి నియామకమయ్యారు. అలాగే, కబడ్డీ రాష్ట్ర జట్టుకు మేనేజర్‌గా సతివాడ మోడల్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు పి.స్వాతి నియామకమయ్యారు. వీరిద్దరినీ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్‌కౌశిక్, కార్యదర్శి సూరిబాబు, అండర్–19 స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షుడు బొమ్మన రామారావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎల్.వి.రమణ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం సభ్యులు, అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

నిధుల మంజూరుకు వినతి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో ప్రాధాన్యత పనులు పూర్తిచేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూమి రీ–సర్వే ప్రక్రియ ఫిబ్రవరి 2024 నాటికి పూర్తి చేయాలన్నారు. రీ–సర్వే, గ్రామీణ అభివృద్ధి, గృహ నిర్మాణం, పంచాయతీరాజ్, శాశ్వత భూహక్కు భూరక్ష, ఉపాధి హామీపథకం, ఆధార్ సీడింగ్, మస్టర్ వెరిఫికేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధిహామీ పనులు జిల్లాలో జోరుగా సాగుతున్నాయన్నారు. పనికి ఆసక్తి చూపేవారందరికీ పని కల్పిస్తున్నామని చెప్పారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జేసీ ఆర్. గోవిందరావు, పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్వో జె.వెంకటరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కృష్ణాజీ పాల్గొన్నారు.

రైతన్నకు మద్దతుగా

జగనన్న సర్కారు

- ఏ పంట పండించినా మద్దతు ధర కల్పిస్తున్నాం
- రైతులకు మేలుచేసేలా పథకాలు అమలు
- రైతు భరోసా కింద రూ.193.74 కోట్ల నిధులు విడుదల
- పెట్టుబడి రాయితీగా మరో రూ.73.42 లక్షలు రైతుల ఖాతాల్లో జమ
- నిధులు విడుదల చేసిన మంత్రి బొత్స సత్యనారాయణ



రైతుభరోసా నిధుల నమూనా చెక్కును ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, కలెక్టర్ నాగలక్ష్మి, తదితరులు

బొబ్బిలి: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతన్నకు 'మద్దతు'గా నిలుస్తోందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక ట్రెండు పంటలకే మద్దతు ధరలుండేవి.. మిగతా పంటలు పండిస్తే దళారుల పరమే.. ఇప్పుడు రైతులు తమకు నచ్చిన పంట సాగుచేసినా మద్దతు ధర కల్పించి, రైతుల వ్యక్తిగత ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నట్టు వెల్లడించారు. బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయిలో రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులకు ఖరీఫ్ సమయంలో పెట్టుబడుల కోసం డబ్బులు అవసరమని, గతంలో మెడలో బంగారాలు, భూములు తాకట్టు పెట్టుకుని బ్యాంకుల చుట్టూ తిరిగే వారన్నారు. ఇప్పుడు ఆ ఇబ్బందులు లేకుండా వేస్నీళ్లకు చన్నీళ్లు తోడులా ఏటా రూ.13,500లు మూడు దఫాలుగా రైతుల వ్యక్తిగత ఖాతాల్లో నగదు రూపంలో నాలుగేళ్లగా ప్రభుత్వం జమచేస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఐదో ఏట మొదటి విడతగా రూ.7,500లను గురువారం రైతుల వ్యక్తిగత ఖాతాలకు కర్నూలు జిల్లా పత్తికొండ వేదికగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమచేశారన్నారు.

రైతులు సాగు చేసిన ఏ పంటకైనా మద్దతు ధర కల్పించడం కేవలం మన రాష్ట్రంలోనే అమలవుతున్నట్టు వెల్లడించారు. గతంలో చెరకు రైతులకు ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీ రూ.30 కోట్లకు పైగా బిల్లులు బకాయి పెట్టి రోజులునెట్టుకొస్తుంటే వారి ముక్కు పిండి వసూలు చేసి బకాయిలు చెల్లించామన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి చెరకు తరలించి వెంట వెంటనే తరలింపు, బిల్లుల చెల్లింపుల ఏర్పాటు చేసినట్టు గుర్తు చేశారు. కొంత మంది ఉద్యోగులకు కూడా వేతన బకాయిలున్నాయని, వాటిని కూడా త్వరలోనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి బొత్స అన్నారు. దేశానికి వెన్నెముఖ అయిన రైతులకు ఏ కష్టం రానివ్వబోమన్నారు. వారికి ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై ఆర్‌బీకేల ద్వారా అందిస్తూ ఉత్పత్తుల విక్రయాలకు కూడా మద్దతు ధర, మార్కెటింగ్ సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల నుంచి రాష్ట్రంలోని వ్యవసాయ రంగంతో పాటు ఏ రంగంలోనూ ఇబ్బందులు రానీయలేదన్నారు. సమస్య వస్తే పారిపోలేదనీ, వాటికి ఖచ్చితమయిన పరిష్కారం చూపామని రైతుల హర్షధ్వానాల మధ్య పేర్కొన్నారు. అనంతరం రైతుభరోసా రైతు భరోసా కింద జిల్లాలోని 2.58లక్షల మంది రైతులకు మంజూరైన రూ.193.74 కోట్ల నిధుల నమూనా చెక్కును ఆవిష్కరించారు. మండల పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం స్టాల్స్, దీక్షా మహిళా వెల్ఫేర్ సొసైటీ స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, ఆర్డీఓ పి.శేషశైలజ, జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు, బొబ్బిలి ఏడీ మజ్జి శ్యామ్‌సుందర్, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ విశ్వేశ్వరరావు, డీడీలు డాక్టర్ వై.వి.రమణ, డాక్టర్ నీలయ్య, బుడా చైర్మన్ ఇంటి పార్వతి, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి బెల్లం సమస్య

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురం, కోమటిపల్లి, బాడంగి మండలంలోని ముగడ గ్రామాలకు చెందిన బెల్లం రైతులు తమ వద్ద టీటీడీ కొనుగోలు చేస్తామని చెప్పి బెల్లం కొనుగోలు చేయడం లేదని, వాటిని భద్రపరచుకోలేక ఇబ్బందులు పడుతున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ టీటీడీ కొనుగోలుకు సమయం ఎక్కువ తీసుకుంటుందని, బయట మార్కెట్‌లో విక్రయిస్తారా అని రైతులను ప్రశ్నించారు. దీనికి రైతులు అంగీకరించడంతో రెండు రోజుల్లో బెల్లం కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రూ.1200 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు



విజయనగరం ఉమ్మడి జిల్లాలోని రైతులు పండించిన చెరకు తరలింపుతో పాటు వరి, మొక్కజొన్న రైతులకు ఖచ్చితమైన మద్దతు ధరలను ప్రభుత్వం కల్పించిందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రూ.1200 కోట్ల విలువైన ధాన్యంను ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. మొక్కజొన్న ధర ప్రారంభంలో బాగుండి తరువాత దళారుల ప్రమేయం తెలిసిన వెంటనే కొనుగోలు కేంద్రాలు పెట్టి 5వేల టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసినట్టు చెప్పారు.

మంత్రి బొత్స పర్యవేక్షణలో జిల్లా అభివృద్ధి : ఎమ్మెల్యే శంబంగి



జిల్లాలోని పలు రంగాలకు చెందిన అభివృద్ధి పనులను ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ మోనిటరింగ్ చేసి ముందుకు నడిపిస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు.రైతులకు కేవలం వ్యవసాయమే కాకుండా కోళ్ల పరిశ్రమలు, డెయిరీ పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పించడం గొప్పవిషయమన్నారు.

రైతుకు లబ్ధి: కలెక్టర్ నాగలక్ష్మి



రైతులకు ఖరీఫ్ సమయంలో ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై ఇస్తున్నట్టు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. అలాగే పెట్టుబడి రాయితీ నిధులను విడుదల చేస్తున్నామన్నారు. రబీలో మొక్క జొన్న కొనుగోలు చేసినట్టు చెప్పారు. పంటల భీమా అమలు చేస్తున్నామన్నారు. రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

పింఛన్ల పంపిణీలో

జిల్లా ఫస్ట్



రామలింగాపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు గొంప దేముడమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఉమ



విజయనగరం చిన్నవీధిలో వృద్ధుడు సన్యాసికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పార్వతి



విజయనగరం లంకవీధిలో శంకరరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రావణి

విజయనగరం అర్బన్: వైఎస్సార్ పెన్షన్ కానుకల పంపిణీలో విజయనగరం జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. తొలి రోజు గురువారం 85.52 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసి ఈ ర్యాంకు సాధించింది. జిల్లాలోని 14 రకాల పింఛన్లు 2,77,219 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా, 2,37,074 మందికి అందజేసినట్టు డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి తెలిపారు. అత్యధికంగా 92 శాతం దాటి పింఛన్ల పంపిణీతో కొత్తవలస, నెల్లిమర్ల అర్బన్ ముందువరుసలో ఉన్నాయి. 90 శాతం దాటి బొండపల్లి, విజయనగరం మండలాలు, 81 శాతం దాటి రాజాం, డెంకాడ మండలాల్లో పింఛన్ల పంపిణీ జరిగింది.

రెవెన్యూ శాఖలో ముగిసిన బదిలీలు

విజయనగరం అర్బన్:

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు నేపథ్యంలో రెవెన్యూ శాఖకు చెందిన వివిధ కేటగిరీ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ గురువారంతో ముగిసింది. బదిలీల జాబితాను కలెక్టర్ నాగలక్ష్మి విడుదల చేశారు. తహసీల్దార్ల క్యాడర్‌లో 9 మందికి, డిప్యూటీ తహసీల్దార్లు 17 మందికి స్థానచలనం కలిగింది. బదిలీలు ఇలా..

బదిలీ అయిన తహసీల్దార్ల వివరాలు....

ప్రస్తుత స్థానం	పేరు	బదిలీ అయిన స్థానం
విజయనగరం	సీహెచ్ బంగారురాజు	భోగాపురం
భోగాపురం	కోరాడ శ్రీనివాసరావు	విజయనగరం
తెర్లాం	డి.రాజేశ్వరరావు	బొబ్బిలి
మెరకముడిదాం	బి. రత్నకుమార్	తెర్లాం
బొబ్బిలి	ఎన్.రాజారావు	రామభద్రపురం
వేపాడ	ఎస్.కృష్ణంరాజు	రాజాం
రాజాం	పి. విజయభాస్కర్	మెరకముడిదాం
కొత్తవలస	డీఎన్‌జీఎన్ ప్రసాదరావు	బొండపల్లి
బొండపల్లి	శ్రీనివాస్ మిశ్రా	కొత్తవలస
ఎల్.కోట	టి.రామకృష్ణ	మెంటాడ
మెంటాడ	వి. ఆదిబాబు	ఎల్.కోట

బదిలీ అయిన డిప్యూటీ తహసీల్దార్ల వివరాలు:

ప్రస్తుత స్థానం	పేరు	బదిలీ అయిన స్థానం
తెర్లాం(హెచ్‌డీటీ)	జి.సత్యనారాయణ	రేగిడి (హెచ్‌డీటీ)
విజయనగరం(సివిల్ సప్లయ్)	జి.వి.భాస్కరరావు	తెర్లాం (హెచ్‌డీటీ)
బొబ్బిలి (సివిల్ సప్లయ్)	ఎ.స్వర్ణలత	విజయనగరం (సివిల్ సప్లయ్)
విజయనగరం (సోషల్‌వెల్ఫేర్)	ఎం. ఉమ	బొబ్బిలి (ఎస్‌డీసీ ఆఫీస్)
నెల్లిమర్ల (ఎలక్షన్ డీటీ)	ఎన్ రమేష్	విజయనగరం (సోషల్‌వెల్ఫేర్)
బొబ్బిలి (ఎలక్షన్ డీటీ)	ఆర్.ఈశ్వరమ్మ	నెల్లిమర్ల (ఎలక్షన్ డీటీ)
విజయనగరం (ఏపీఎస్‌ఈఎస్‌సీ)	ఎం.శ్రీనివాసరావు	బొబ్బిలి (ఎలక్షన్ డీటీ)
రేగిడి (హెచ్‌డీటీ)	బి.గోవిందరావు	విజయనగరం (ఏపీఎస్‌ఈఎస్‌సీ)
రేగిడి (సివిల్‌సప్లయ్)	ఆర్.సాయికృష్ణకుమార్	బొబ్బిలి(సివిల్ సప్లయ్)
రాజాం(హెచ్‌డీటీ)	ఎ.సాయికామేశ్వరరావు	రేగిడి(సివిల్ సప్లయ్)
బొబ్బిలి (సివిల్ సప్లయ్)	డి. గాంధీ	రాజాం(హెచ్‌డీటీ)
చీపురుపల్లి (ఎల్‌ఆర్‌డీటీ)	ఎల్.వి.విజయలక్ష్మి	గంట్యాడ(సివిల్‌సప్లయ్)
గంట్యాడ (సివిల్ సప్లయ్)	కె. ఇందిర	చీపురుపల్లి(ఆర్‌డీవో ఆఫీస్)
కొత్తవలస (సివిల్‌సప్లయ్)	కె. శ్రీనివాసరావు	నెల్లిమర్ల(సివిల్‌సప్లయ్)
నెల్లిమర్ల (సివిల్ సప్లయ్)	టి.రమేష్	కొత్తవలస(సివిల్ సప్లయ్)
పార్వతీపురం (ఎస్‌డీసీ ఎల్‌ఏ)	కె.భరత్‌కుమార్	ఎస్.కోట(హెచ్‌డీటీ)
ఎస్.కోట(హెచ్‌డీటీ)	పి.హరి	పార్వతీపురం(ఎస్‌డీసీ ఎల్‌ఏ)

ముందస్తు సమాచారమే ప్రధానం

- ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ వివరాలు తెలియజేయాలి
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ముందస్తు సమాచారం ఇవ్వాలని, దీనివల్ల ఆయా గ్రామాల ప్రజలందరూ వైద్యసేవలను సద్వినియోగం చేసుకునేందుకు వీలుకలుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. గిరిమిత్ర సమావేశ మందిరంలో హెల్త్ సూపర్‌వైజర్లకు ఆరోగ్య కార్యక్రమాలపై గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అందజేస్తున్న వైద్యసేవలను పోస్టర్ రూపంలో ప్రదర్శించాలన్నారు. గర్భిణుల నమోదు త్వరితగతిన జరగాలని, షెడ్యూల్ ప్రకారం ఆరోగ్య తనిఖీల కోసం నాలుగుసార్లు పూర్తి చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. హైరిస్క్ గర్భిణులను త్వరగా గుర్తించడం ద్వారా సరైన ఆరోగ్య పర్యవేక్షణ చేసి మాతా శిశుమరణాలను నివారించవచ్చునన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సాగుతున్న ఇంటింటా దోమల నివారణమందు పిచికారీని పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, డీఐఓ డా.టి.జగన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.వెంకటరమణ, డా. నవీన్‌కుమార్, ప్రోగ్రామ్ అధికారి డా.వినోద్, డీపీహెచ్ ఎన్‌ఓ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు

విజయనగరం పూల్‌బాగ్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 33 పరీక్ష కేంద్రాల్లో 5,610 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షలను మూడు స్క్వాడ్ బృందాలు పర్యవేక్షిస్తాయని డీఈఓ బి లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఈనెల 10వ తేదీవరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

పూల సోయగం



విజయనగరం జిల్లా కేంద్రంలోని చింతలవలస, ధర్మపురి గ్రామ సమీప రోడ్డులో ప్రయాణించేవారికి తురాయి చెట్లు పూలతో స్వాగతం పలుకుతున్నాయి. చెట్ల నిండా పూలతో కనువిందు కలిగిస్తున్నాయి. మగువుల మనసు దోచుకుంటున్నాయి. - సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

కేజీబీవీల్లో కొలువుల జాతర

- జిల్లాలోని 14 కేజీబీవీల్లో 59 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ
- జూన్ 4వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మహిళా అభ్యర్థులకు మాత్రమే అవకాశం



సీతంపేట మండల కేంద్రంలోని కేజీబీవీ

పాలకొండ రూరల్: అర్హత గల నిరుద్యోగ మహిళా అభ్యర్థులకు సువర్ణావకాశం. కాంట్రాక్టు పద్ధతిలో కేజీబీవీల్లోని ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ప్రత్యేక అధికారులతో పాటు బోధన సిబ్బంది నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని 14 కేజీబీవీల్లో ఉన్న 59 ఖాళీలను భర్తీ చేయనుంది.

ఖాళీలు ఇలా...

జిల్లా పరిధిలోని 14 కేజీబీవీ పాఠశాలల్లో 18 సీఆర్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిలో తెలుగు–2, హిందీ–2, ఇంగ్లిష్–3, గణితం–5, పీఎస్–2, ఎన్ఎస్–2, సోషల్–2 పోస్టులు ఉన్నాయి. 41 పీజీటీలకు సంబంధించి తెలుగు–5, ఇంగ్లిష్–9, గణితం–2, ఫిజిక్స్–1, కెమిస్ట్రీ–4, బోటనీ–2, జువాలజీ–2, హిస్టరీ–1, ఎకనామిక్స్–2, సివిక్స్–2, కామర్స్–1, ఎంపీహెచ్‌డబ్ల్యూ–4, జీఎఫ్‌సీ–4, సీఎస్సీ–2 పోస్టులు భర్తీచేయనున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

అర్హులైన మహిళా అభ్యర్థులు మాత్రమే తమ అర్హతకు అనుగుణంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్ వెబ్ సైట్లో రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో తమ పూర్తి వివరాలు పొందుపరచాలి. నిబంధనల మేరకు దరఖాస్తు పూర్తి చేయాలి. జూన్ 4వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు దరఖాస్తులు ఆన్‌లైన్ చేసేందుకు అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఆఫ్‌లైన్, నేరుగా దరఖాస్తులు స్వీకరించబడవు. ఓపెన్ కేటగిరీకి చెందిన అర్హుల వయస్సు 18 నుంచి 42 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 5 ఏళ్లు, మాజీ సైనిక ఉద్యోగులకు 3, దివ్యాంగులకు 10 ఏళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుంది.

ప్రభుత్వ ఆదేశాలతో...



కేజీబీవీల్లో ఖాళీలను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా పరిధిలో 14 కేజీబీవీల్లో ఉన్న ఖాళీలను ఏడాది కాలపరిమితితో మహిళా సిబ్బందిని నియమించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. నిబంధనలు, జిల్లాలో పోస్టుల వివరాలు, విద్యార్హతలు వెబ్‌సైట్‌లో పొందుపర్చాం. మొత్తం 59 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అర్హులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

– నిమ్మక ప్రేమ్‌కుమార్, విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

క్లుప్తంగా

బంగారు తల్లి

- ఖేలో ఇండియా వర్సిటీ క్రీడల్లో పల్లవికి స్వర్ణం



సాధించిన స్వర్ణ పతకం చూపిస్తున్న వెయిట్ లిఫ్టర్ శనపతి పల్లవి

నెల్లిమర్ల రూరల్: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా వేదికగా జరుగుతున్న ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో జిల్లాకు చెందిన వెయిట్ లిఫ్టర్ శనపతి పల్లవి ప్రతిభ కనబర్చింది. గత నెల 25 నుంచి జరుగుతున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన పల్లవి స్వర్ణపతకం సాధించింది. 64 కేజీల విభాగంలో గురువారం పోటీల్లో పాల్గొన్న పల్లవి స్నాచ్ 84 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 108 కిలోల చొప్పున బరువును ఎత్తి ఘనత సాధించింది. స్వర్ణ పతకం సాధించిన పల్లవికి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రతినిధులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

అలరించిన కళాజాతా



నెల్లిమర్లలో ప్రదర్శిస్తున్న బుర్రకథ

నెల్లిమర్ల: పట్టణంలోని రామతీర్థం జంక్షన్‌లో గురువారం ప్రదర్శించిన కళాజాతా అందరినీ అలరించింది. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ కళాజాతాలో బుర్రకథ ద్వారా కాలుష్య నియంత్రణపై అవగాహన కల్పించారు. మొక్కలు విరివిగా నాటాలని.. మొక్కలను పెంచాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మిషన్ లైఫ్‌లో కార్యక్రమంలో భాగంగా వ్యర్థాలను తొలిగిస్తున్న ఎంపీడీఓ రామారావు, తదితరులు

పూసపాటిరేగ: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ జి.రామారావు అన్నారు. గురువారం స్థానిక బూడివీధిలో మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా రహదారిపై ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఎంపీడీఓ రామారావు వలంటీర్లతో కలిసి తొలగించారు. పాత జాతీయరహదారి నుంచి బూడివీధి కాలనీ రహదారి వరకు చెత్తాచెదారాలను ఏరివేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామారావు మాట్లాడుతూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ధనుంజయ్, వీఆర్‌ఓ దురగాసి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆయుర్వేదిక్ మందులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆయుర్వేదిక్ వైద్యాధికారి శ్రీనివాసరావు

రామభద్రపురం: ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న ఆయుర్వేదిక్ మందులను సద్వినియోగం చేసుకోవాలని ఆయుష్ వైద్యాధికారి ఎస్.శ్రీనివాసరావు కోరారు. గురువారం స్థానిక ఆయుష్ ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడిన ఆయన అన్ని రకాల వ్యాధుల నివారణకు సంబంధించి, ఆయుర్వేదిక్ మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. సుగర్, వాతనొప్పులు, గ్యాస్టిక్, రక్తహీనత, ఆమవాతం, బీపీ, చర్మవ్యాధులకు సంబంధించి, మందులు ఉన్నాయన్నా రు. దీర్ఘకాలికంగా ఆయా వ్యాధులతో బాధపడుతున్న వారు వైద్యుల సూచనల మేరకు మందులు పొంది, వాడుకోవాలని తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,760-00
బంగారం(22సి. 10గ్రా.)	55,700-00
వెండి (కిలో)	77,600-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹154	₹278	₹ 288

రైతులకు యంత్ర సాయం

- నేడు జిల్లా కేంద్రంలో అందించేందుకు ఏర్పాట్లు
- పాల్గొననున్న మంత్రి బొత్స సత్యనారాయణ



యంత్ర సేవా పథకం కింద రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

విజయనగరం ఫోర్ట్: రైతు సంక్షేమానికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వం వ్యవసాయంలో యాంత్రీకరణను పెంచేందుకు యంత్ర పరికరాలను రాయితీపై అందిస్తోంది. ఈ మేరకు ప్రతి రైతు భరోసా కేంద్రంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ)ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో యంత్ర సేవా పథకం క్రింద యంత్ర పరికరాలను అందిస్తున్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రానికి రూ.15 లక్షల విలువైన పనిముట్లతో 40 శాతం రాయితీతో కూడిన సామూహిక యంత్ర సేవా కేంద్రం ఇవ్వాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశ మెగా మేళా (2021-22)లో భాగంగా జిల్లాలోని 326 సీహెచ్‌సీలకు రూ.934 కోట్ల రాయితీని ప్రభుత్వం అందించింది.

రెండో దశ అందించేందుకు ఏర్పాట్లు

రెండో దశ యంత్ర పరికరాలను శుక్రవారం అందించేందుకు జిల్లా కేంద్రంలోని కోట జంక్షన్‌లో వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.184 గ్రూపులకు 505 పనిముట్లు ఈ సందర్భంగా అందించనున్నారు. వాటిలో 34 రొటవేటర్లు, 16 నూర్పిడి యంత్రాలు, 22 మొక్కజొన్న నూర్పిడి యంత్రాలు, 18 స్ప్రేయర్లు, 48 పవర్ వీడర్లు, 16 వరి కోత యంత్రాలు, 351 ట్రాక్టర్‌లతో నడిపే యంత్ర పరికరాలు, 123 ట్రాక్టర్లు ఉన్నాయి. మొత్తం యంత్ర పరికరాల ఖర్చు రూ.15. 20 కోట్లు కాగా ఇందులో రాయితీ కింద ప్రభుత్వం రూ. 4.54 కోట్లు అందించనుంది.

నియోజకవర్గాల వారీగా అందించనున్న యంత్ర పరికరాలు

నియోజకవర్గం	గ్రూపులు	ట్రాక్టర్లు
బొబ్బిలి	25	23
గజపతినగరం	33	25
చీపురుపల్లి	17	12
రాజాం	47	27
విజయనగరం	1	1
నెల్లిమర్ల	21	11
ఎస్.కోట	40	24

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

- గంజాయి, సారా రవాణాపై ఉక్కుపాదం మోపాలి
- కోర్టు కేసుల్లో బాధితులకు న్యాయం చేయాలి
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్, అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్



కానిస్టేబుళ్లకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్పీ

పార్వతీపురంటౌన్: పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక కార్యాచరణతో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గంజాయి, సారా రవాణా విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్‌అండ్ డ్రైవ్ తనిఖీలు విధిగా నిర్వహించాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వాహన దారులను అప్రమత్తం చేస్తూ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా కోర్టుల్లో ట్రయల్‌కు వచ్చిన కేసులను స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌డివిజన్ పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసుకుంటూ ఉండాలని సూచించారు. కోర్టు వాయిదాలకు సాక్షులు సక్రమంగా హాజరవుతున్నారా? లేదా? వారిని ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తున్నారా? అన్న సమాచారాన్ని కోర్టు కానిస్టేబుల్ ద్వారా తెలుసుకుని సాక్షులు నిర్భయంగా వాస్తవాన్ని న్యాయమూర్తి ఎదుట ధైర్యంగా చెప్పేలా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు.

ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసాపత్రాలు

తమ తమ పోలీసు స్టేషన్ల పరిధిలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసాపత్రాలను అందజేశారు. రాత్రిపూట గస్తీ తిరుగుతూ విధులు నిర్వహిస్తున్న పార్వతీపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ జె.చిరంజీవి హోం గార్డు, ఎం. శంకరరావు, మక్కువ పోలీసుస్టేషన్‌కు సంబంధించిచోరీ కేసులో సొత్తు రికవరీ చేసి, నిందితుడిని పట్టుకున్నందుకు గాను కానిస్టేబుల్‌కు ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్‌కిరణ్, ఏఎస్పీ సునీల్ షరోన్, పాలకొండ ఎస్‌డీపీఓ కృష్ణారావు, దిశ డీఎస్పీ ఎస్ఆర్ హరిత, ఏఆర్‌డీఎస్పీ నాగేశ్వరరావు, ఎస్పీ సీఐ శ్రీనివాసరావు, జిల్లా సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలు



రోడ్డుపై గాయాలపాలైన ఆటో ప్రయాణికులు



తేనెటీగల దాడిలో గాయాల పాలై ఆస్పత్రిలో చేరిన జమ్ము రాములు

సీతానగరం: మండలంలోని రాష్ట్రరహదారిలో లచ్చయ్యపేట వద్ద గురువారం మధ్యాహ్నం ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో అందులో ప్రయాణం చేస్తున్న ఇద్దరు ప్రయాణికులు గాయాల పాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. సీతానగరం నుంచి బొబ్బిలి వెళ్తున్న ఆటోలో బి శంకరరావు, కాశీపేటకు చెందిన మైలపిల్లి అప్పమ్మ ప్రయాణం చేస్తున్నారు. లచ్చయ్యపేట గ్రామం దాటిన తరువాత స్పన్ పైప్‌ల కంపెనీకి వచ్చే సమయానికి ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో అదుపు తప్పి రోడ్డుపక్కనే ఉన్న గాడీలో ఆటో పడిపోవడంతో ప్రమాదం జరిగింది. రోడ్డుపై పడిన క్షతగాత్రులిద్దరినీ అటుగా ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారు గుర్తించి సపర్యలు చేసి 108 కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి బొబ్బిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తేనెటీగల దాడిలో పలువురికి..

గజపతినగరం: మండలంలోని కెంగువ గ్రామం జగ్గాపు చెరువులో ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులపై తేనె టీగలు దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు. చెరువులో ఉపాధి పనులు చేస్తూ మట్టి మోస్తున్న సమయంలో సుమారు 15మంది వేతనదారులపై తేనెటీగలు దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. బాధితుల్లో జమ్మురాములు, మజ్జిరాము, మజ్జిబంగారు నాయుడు, మజ్జి సత్యారావు, కె.రాములు గజపతి నగరం ఏరియా ఆస్పత్రిలో చేరి వైద్యసేవలు పొందుతున్నారు. మరికొంతమంది చిన్నపాటి గాయాలతో ఇళ్ల వద్ద ఉంటూ చికిత్స తీసుకుంటున్నారు.

ఉద్యోగమేళా రేపు

విజయనగరం రూరల్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 3న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి డి.అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జాబ్ సీకర్ లాగిన్‌లో తమ పేర్లు నమోదు చేసుకుని.. బయోడెటా, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉద్యోగ మేళాకు హాజరు కావాలన్నారు. విశాఖపట్నంలోని సీనరి జీస్ కాస్టింగ్స్ లిమిటెడ్‌లో 400 ఉద్యోగాలకు సంబంధించి నిర్వహించే ఉద్యోగ మేళాకు బీఎస్సీ, ఐటీఐ, డిప్లమో పూర్తి చేసి 19 నుంచి 35 ఏళ్ల లోపున్న నిరుద్యోగులు అర్హులన్నారు.

భాషా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి



అధ్యాపకులకు అవగాహన కల్పిస్తున్న వైస్‌చాన్సలర్ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: అధ్యాపకులు భాషా నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సెంచూరియన్ వీసీ జీఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో సాఫ్ట్ స్కిల్స్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మెదడుకు పదును పెడుతూ బోధన పద్ధతులను మెరుగుపరుచుకోవాలని సూచించారు. అధ్యాపకులు ఎలాంటి లక్షణాలు కలిగి ఉండాలో పవర్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, డీన్లు కృష్ణమూర్తి, లక్ష్మీ నరసింహాచార్యులు, విశ్రాంత ప్రొఫెసర్ శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి



మృతిచెందిన పార్వతి

పార్వతీపురం: మండలంలోని పిన్నింటి రామినాయుడు వలస గ్రామంలో గురువారం పాముకాటుతో మహిళ మృతిచెందింది. ఈ ఘటనపై జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బంకపల్లి పార్వతి(30) బహిర్భూమికి వెళ్లి వస్తుండగా పాము కాటువేయడంతో తక్షణమే స్పందించిన కుటుంబ సభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మార్గమధ్యంలో మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలికి భర్త శ్రీనివాసరావుతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు అవుట్‌పోస్టు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..



తీవ్రగాయాలతో పడి ఉన్న హరిహర కుమార్(ఫైల్)

బొండపల్లి: మండలంలోని మరువాడ గ్రామానికి సమీపంలో ద్విచక్ర వాహనం నడుపుతూ ప్రమాదానికి గురైన బాధితుడు మృతి చెందినట్లు ఎస్సై ఎస్.రవి గురువారం తెలిపారు. గత నెల 28న మండలంలోని రయింద్రాం గ్రామానికి చెందిన హరి హర కుమార్(40) ద్విచక్ర వాహనంపై వస్తూ ప్రమాదానికి గురి కాగా తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన హరిహరకుమార్‌ను శ్రీకాకుళంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఘనంగా రాజన్నదొర జన్మదినోత్సవం



ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు



శుభాకాంక్షలు తెలుపుతున్న జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి తదితరులు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



ఆస్పత్రిలో అన్నదానం చేస్తున్న నాయకులు

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర జన్మదినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, కుటుంబసభ్యులు తదితరులు రాజన్నదొర ఇంటికి చేరుకుని ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారులు, నాయకులు రాజన్నదొరకు జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపేందుకు స్థానిక, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అందరినీ రాజన్నదొర ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా బాణసంచా కాల్చారు.

ఎమ్మెల్యే పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు

పార్వతీపురంటౌన్: ఎమ్మెల్యే అలజంగి జోగారావు పుట్టిన రోజు సందర్భంగా గురువారం మండల, పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. మండల ప్రజాప్రతినిధులు గుంట్రెడ్డి దామోదరరావు, మజ్జి శేఖర్, ఎంపీటీసీ సభ్యుడు బంకురు రవికుమార్ ఆధ్వర్యంలో నాయకుల సమక్షంలో జిల్లా ఆస్పత్రిలో కార్మికులకు రోగులకు రొట్టెలు, పండ్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావుల ఆధ్వర్యంలో ఆశాజ్యోతి ఆశ్రమంలో చిన్నారులకు, ఏరియా ఆస్పత్రిలో సిబ్బందికి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, ఆత్మ చైర్మన్ తిరుపతిరావు, పీఏసీఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, గొర్లి మాధవరావు పాల్గొన్నారు.

గడపగడపకు ద్విశత దినోత్సవం

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కటింగ్
- దేశపాత్రునిపాలెంలో వైఎస్ విగ్రహానికి నివాళులు



గడప గడపకు మన ప్రభుత్వం 200 రోజులు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇతర నాయకులు

కొత్తవలస:

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎస్.కోట నియోజక వర్గంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం నాటికి 200 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆనాడు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన ప్రజాసంకల్పయాత్రలో భాగంగా 3వేల కిలోమీటర్లు పూర్తి చేసిన గుర్తుగా దేశపాత్రుని పాలెంలో ఏర్పాటు చేసిన పైలాన్‌వద్ద మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతో కలిసి పూలమాలలు వేసి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడు బాబు, నియోజకవర్గం పార్టీ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి జగనన్న ప్రజా ప్రభుత్వంలో అమలు చేస్తున్న అభివృద్ధి ఫలాలు, సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అంటూ ఆరా తీశారు. గ్రామస్తులు చెప్పిన సమస్యలను అక్కడికక్కడే కొన్నింటిని పరిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముందుగా 2వందల రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ దేశపాత్రునిపాలెం గ్రామానికి రాష్ట్రంలోనే మంచి గుర్తింపు ఉందన్నారు. ఆనాడు ప్రజా సంకల్పయాత్ర 3వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భారీ పైలాన్ నిర్మించడంతో రాష్ట్ర స్థాయిలోనే మంచి గుర్తింపు వచ్చిందన్నారు. అలాగే జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఇదే గ్రామంలో 200 రోజు గడుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

టీడీపీకి చివరి ఎన్నికలు

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతిలు మాట్లాడుతూ రానున్న 2024 ఎన్నికలు తెలుగుదేశం పార్టీకి చివరి ఎన్నికలని జోస్యం చెప్పారు. ఎన్నికల ముందు ఆల్‌ఫ్రీ అంటూ నయవంచకుడు చంద్రబాబు ప్రచారం మొదలపెట్టారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ ప్రజా మద్దతు పెరుగుతోందని రానున్న ఎన్నికల్లో 175 సీట్లును కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొత్తవలస, వేపాడ ఎంపీపీలు నీలంశెట్టి గోపెమ్మ, దొగ్గ సత్యవంతుడు, కొత్తవలస, వేపాడ, జామి మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, జగ్గుబాబు, గొర్లె రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ,దేశపాత్రుని పాలెం సర్పంచ్, ఎంపీటీసీలు దలాయి లక్ష్మి, కోరుబిల్లి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డు అప్పారావు, ఏడువాక నారాయణ, బొంతల వెంకటరావు, నియోజకవర్గంలో గల పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు,పార్టీ ముఖ్య నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు